క్లుప్తంగా

అభివృద్ధికి సహకరించాలి



డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని డీఈఓ రవీందర్ రెడ్డి కోరారు. మండలంలోని ముల్కలపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న శైలజ తన మిత్రుల సహకారంతో 85 మంది విద్యార్థులకు టై, బెల్టు, బూట్లు, బ్యాగులు, డైరీలు సమకూర్చారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా, కాంప్లెక్స్ హెచ్ఎం రుక్మాంగధరరావు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుదాస్, హెచ్ఎం బంతిరామ్, రుద్ర రమేష్, శైలజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక

నెహ్రూసెంటర్: జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్స్ బుధవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు సమక్షంలో సంఘంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూలో కార్మికుల హక్కుల కోసం మరింత పోరాటాలు నిర్వహించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రభాకర్, ఉప్పలయ్య, మల్లేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై శ్రమదానం

డోర్నకల్: డోర్నకల్ సమీపంలోని మున్నేరు బ్రిడ్జిపై బుధవారం కాంగ్రెస్ నాయకులు శ్రమదానం నిర్వహించారు. బ్రిడ్జిపై మట్టి పేరుకుపోయి వర్షపునీరు వెళ్లే మార్గాలు మూసుకుపోవడం, గడ్డి పెరగడంతో నీరంతా బ్రిడ్జిపై నిలిచి రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో స్పందించిన కాంగ్రెస్ నాయకులు శ్రమదానంతో మట్టి, గడ్డిని తొలగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, నానీయాదవ్, సుశీల్‌జైన్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగుల పంపిణీ

మహబూబాబాద్: పేదలను ఆదుకునేందుకు లయన్స్ క్లబ్ ముందుంటుందని క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీరన్న అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రోడ్లపై వ్యాపారం చేసుకునే పేదలకు పెద్ద గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాలకు సేవలు అందచేయాలన్నదే క్లబ్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ పర్కాల రవీందర్‌రెడ్డి, కోశాధికారి కరుణాకర్, రాజ్‌కుమార్, జగన్‌మోహన్‌రావు, సనాతనచారి, సురేష్, ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలకు నిలబడతాం

గంగారం : హక్కులకై కలబడడమే కాదు... బాధ్యతలకు నిలబడతామని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య అన్నారు. టీపీటీఎఫ్ గంగారం మండల కమిటీ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు పెనుక వీరస్వామి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సాంబయ్య మాట్లాడారు. ఫెడరేషన్ కార్యకర్త సంద్ర ఉపేందర్‌రావు గత సంవత్సరం మృతిచెందాడని, అతడి భార్యకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించడంలో కృషి చేసిన కోమట్లగూడెం కాంప్లెక్ హెచ్ఎం, ఎంఈఓలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గంగారం మండల ప్రధాన కార్యదర్శి అయిలబోయిన శ్రీకల, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూపోరాట యోధుడు రావూజీ

గార్ల: హత్యకు గురైన గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఇస్లావత్ రావూజీ ఆశయాల సాధనకు యువత ముందుండి పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రావూజీ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం మండలంలోని వెంకటాపురం తండా క్రాస్‌రోడ్‌లోని రావూజీ స్థూపం వద్ద నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, ఈశ్వర్‌లింగం, లోకేశ్వరరావు, అంబటి వీరస్వామి, ఇమ్మడి గోవింద్, ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణ, రాము, వెంకటేశ్వర్లు, నంద్య, మోహన్, సంతు, పెద్దవెంకటేశ్వర్లు, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

చిన్నగూడూరు/కురవి: చిన్నగూడూరు మండలం పగిడిపల్లి గ్రామానికి చెందిన దుండి అశోక్, సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండా గ్రామానికి చెందిన బానోత్ బాలునాయక్ కుమార్తె బానోత్ స్రవంతి బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ ప్రొఫెసర్ వి.నారాయణన్ సమక్షంలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఈసందర్భంగా డాక్టరేట్ అందుకున్నవారిని స్నేహితులు, బంధువులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

వానొస్తే తడవాల్సిందేనా..?

- రైల్వేస్టేషన్‌లో ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో వర్షం వచ్చిన సమయాల్లో, నీడకోసం ఏర్పాటు చేసిన రేకులషెడ్లు మొత్తం కురుస్తుండడంతో ప్రయాణికులు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన రేకులషెడ్లు తుప్పు పట్టిపోయి రేకులకు రంధ్రాలు పడ్డాయి. వర్షం వచ్చిన సమయంలో కురుస్తున్నాయి. ఈ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల టికెట్ల ద్వారా ప్రతీఏటా రూ.కోటిన్నర వరకు ఆదాయం లభిస్తున్నా, రైల్వే ఉన్నతాధికారులు మాత్రం ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో వైఫల్యం చెందారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్‌లోని ఒకటి, రెండో ప్లాట్‌ఫారాలపై కొత్తగా రేకుల షెడ్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. లేదంటే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రైళ్ల కోసం వేచిఉండాల్సిన పరిస్థితి ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.



వాననీటితో తడిసిన రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

కొత్తగూడ: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాల పై అవగాహన పెంచుకుంటే నేరాలకు అవకాశం ఉండదని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. పొగుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. నేరం చేస్తే శిక్ష పడుతుందనే భయం నేరం జరుగకుండా ఉంటుందన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ లాంటి చెడు అలవాట్ల వైపు ఆకర్షితులు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి వల్ల వచ్చే నష్టాలు వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కావొద్దని, సోషల్ మీడియా వల్ల ఉపయోగాలు, ప్రమాదాలను వివరించారు.

సైబర్ క్రైం పట్ల అవగాహణ పెంచుకోవాలి

గూడూరు: ఇటీవల ఎక్కువగా జరుగుతున్న సైబర్ క్రైంపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై రాజమౌళి అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో బుధవారం ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు, విద్యార్థులతో సైబర్ క్రైం, సామాజిక అంశాలపై వివరించారు. సెల్‌ఫోన్ వాడకం ఎక్కువైతే, సెల్ కాల్స్ ద్వారా సైబర్ క్రైంలు కూడా జరుగుతున్నాయన్నారు. అనుమానిత వ్యక్తి, గుర్తు తెలియని కాల్స్ వస్తే లిఫ్ట్ చేయరాదని, కొన్ని పరిస్థితుల్లో సైబర్ క్రైంకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అదే విధంగా ఆటో డ్రైవర్‌లు, ద్విచక్ర, ఇతర వాహనదారులు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్‌లు కల్గి ఉండాలని, ఇతర ఇన్సూ్యరెన్స్ పత్రాలు ఉండాలని, నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



బయ్యారం: ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు



మరిపెడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బయ్యారం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డీఎస్ ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి కేలోత్ సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బయ్యారం బాలికోన్నత పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు.

గూడూరు: గూడూరుతోపాటు పలు మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు అనుబంధంగా వసతి గృహం లేదా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బానోతు దేవేందరా కోరారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ నాగభవానికి కళాశాల విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి వినతిపత్రం అందించారు.

కురవి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంధసిరి జ్యోతిబసు, పట్ల మధు అన్నారు. బుధవారం ఎస్ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన యాత్ర కురవికి చేరుకుంది. సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు స్వాగతం పలికారు.

మరిపెడ: విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఎస్ఎఫ్‌ఐ జిల్లా, అధ్యక్షురాలు గందసిరి జ్యోతిబాసు, కార్యదర్శి పట్ల మధు హెచ్చరించారు. విద్యార్థి పోరుగర్జన జీపు యాత్ర మరిపెడకు చేరుకుంది. ఈ యాత్రకు సీఐటీయూ, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, డీవైఎఫ్‌ఐలు మద్దతు తెలిపాయి.

నానో యూరియాపై రైతులకు అవగాహన

పెద్దవంగర: మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఓ రైతు వ్యవసాయ క్షేత్రం వద్ద బుధవారం స్థానిక రైతులకు నానో యూరియాపై ఏఓ స్వామి నాయక్ అవగాహన కల్పించారు. నానో యూరియాతో పంటలకు మెరుగైన ఉత్పాదకత సాధ్యమని తెలిపారు. ఎకరాకు అరలీటర్ సరిపోతుందని, సంప్రదాయ యూరియా కంటే ఇది సమర్థవంతమని చెప్పారు.



పోచంపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ

పోక్సో కేసు నమోదు

చిన్నగూడూరు: ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు బాషబోయిన మహేశ్ అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటికి అవసర నిమిత్తం వెళ్లాడు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో తలుపులు వేసి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తప్పించుకొని తల్లిదండ్రులకు తెలిపింది. మంగళవారం వారి ఫిర్యాదుతో విచారణ జరిపి మహేశ్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గూడూరు రెండో ఎస్సైగా రాజమౌళి



గూడూరు: గూడూరు పోలీస్‌స్టేషన్ రెండో ఎస్సైగా బుధవారం బి.రాజమౌళి విధులు చేపట్టారు. రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ పనిచేసిన రెండో ఎస్సై బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉండగా, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి వచ్చిన రాజమౌళి సెకండ్ ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘననివాళి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వివిధ మండలాలు, గ్రామాల్లో రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసిన నాయకులు.. ఆయన దేశానికి, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.
– సాక్షి నెట్‌వర్క్



డోర్నకల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు



మరిపెడలో..



తొర్రూరులో..



కేసముద్రంలో..



బయ్యారంలో..

తీరని యూరియా కష్టాలు

జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు యూరియా ఎంతో అవసరం కావడంతో ఒక బస్తా దొరికినా చాలన్నట్టుగా రైతులు రోజంతా పీఏసీఎస్‌ల ఎదుట నిరీక్షిస్తున్నారు. బుధవారం పలు చోట్ల రైతులు చెప్పులు, ఆధార్‌కార్డులను క్యూలో ఉంచారు. మహిళలు అక్కడికే సద్ది తెచ్చుకుని తిని వేచిఉన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రూరల్: స్టేజితండా ఓ గోడౌన్‌లో యూరియా బస్తాలను చూస్తున్న అధికారులు



దంతాలపల్లి: వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్



నర్సింహులపేట: ఎరువుల షాపు ఎదుట బారులుదీరిన రైతులు



మహబూబాబాద్ రూరల్ : టోకెన్ల కోసం నిరీక్షిస్తున్న రైతులు

పోలీసుల లాఠీచార్జ్ అవాస్తవం



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణకిశోర్

నర్సింహులపేట: నర్సింహులపేటలో యూరియా విషయంలో లాఠీచార్జీ చేశారని సోషల్ మీడియాలో వచ్చిన ప్రచారం అవాస్తవమని తొర్రూర్ డీఎస్పీ కృష్ణకిశోర్ అన్నారు. నర్సింహులపేట పీఎస్‌ను బుధవారం సాయింత్రం ఆకస్మిక తనిఖీలో భాగంగా రికార్డులు, పరిసరాలను పరిశీలించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో భారతీ ఫర్టిలైజర్ షాపు వద్ద యూరియా వచ్చిందని రైతులు రావడంతో పోలీసులు వచ్చి వరసలో నిలబెట్టి కూపన్లు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసులు స్నేహపూర్వకంగానే పని చేస్తున్నారని, ప్రతి ఒక్కరు రైతు కుటుంబం నుంచి వచ్చిన వాళ్లేనని తెలిపారు. జరిగిన విషయంను పక్కకు పెట్టి పోలీసులపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

యూరియా అందించడంలో పాలకులు విఫలం

గార్ల: సరిపడా యూరియా అందించడంలో విఫలమైన కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ బుధవారం గార్లలో న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడారు. నందగిరి వెంకటేశ్వర్లు, జడ సత్యనారాయణ, సక్రు, శ్రీధర్‌బాబు, లింగయ్య, చైతన్య, మధు, వీరభద్రం, పాపయ్య, అంజయ్య, గణేష్ పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వం వలనే యూరియా కొరత

బయ్యారం: కేంద్రప్రభుత్వం వలనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి వెంటనే యూరియా దిగుమతులు చేయాలన్నారు. కేంద్రప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకు యూరియా సరఫరా చేసి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు యూరియా సరఫరా చేయకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తుందని మండిపడ్డారు. సమావేశంలో డైరెక్టర్లు వేల్పుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కిషన్‌నాయక్, వీరస్వామి, రమేష్, నాగరాజు, ప్రభాకర్, ప్రదీప్, లక్ష్మి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్‌రెడ్డి

షోకాజా...లైసెన్స్ రద్దా...?

డోర్నకల్: మండలంలో ఫర్టిలైజర్స్ దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించిన అనంతరం తీసుకున్న చర్యలపై అయోమయం నెలకొంది. మంగళవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీఏఓ విజయనిర్మల, ఏడీఏ విజయచందర్ తదితరులు పలు ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. ఫర్టిలైజర్ దుకాణ యజమానులు నిబంధనలు పాటించడం లేదంటూ సాయంత్రం నాలుగు దుకాణాలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు ప్రకటించారు. ఆ దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు రాత్రి ప్రకటించారు. బుధవారం డోర్నకల్‌లో లైసెన్స్ రద్దు చేసిన బాలాజీ ఫర్టిలైజర్స్, వీరవెంకటసత్యనారాయణ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువు, పురుగు మందులు విక్రయించారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ వివరణ కోరగా లైసెన్స్ రద్దు చేసిన దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువుల అమ్మకం పూర్తి చేసేంతవరకు అనుమతిస్తామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

పిల్లలకు ఆటవస్తువుల పంపిణీ

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలోని అంగన్‌వాడీసెంటర్‌లో లయన్స్‌క్లబ్ సభ్యుడు మడిపెద్ది వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు రూ.5 వేల విలువైన ఆటవస్తువులను బుధవారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, యర్రం శ్రీరాములు, బెజ్జం ప్రేమ్‌కుమార్, లక్కాకుల సత్యనారాయణ, నల్ల కిరణ్, మంచన ప్రసాద్, మిశ్రా, టీచర్ రాణి, ఆయా అరుణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

తొర్రూరు రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వచ్చెనెల 1న హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గునిగంటి శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అరిపిరాల హైస్కూల్‌లో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

ముత్యాలమ్మతల్లికి కవిత పూజలు

నెల్లికుదురు: మండల కేంద్రంలో మాల కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముత్యాలమ్మతల్లి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో బుధవారం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అశోద భాస్కర్, వెంకన్న, ఉపేందర్, దర్గయ్య, యాకయ్య, రామచంద్రు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

నెల్లికుదురు: పరిసరాల పరిశుభ్రతతోపాటు పచ్చదనాన్ని పెంపొందించడం అందరి బాధ్యతఅని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బంటు కవిరాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛకళాశాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి పిచ్చి మొక్కలు తొలగించారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

మరిపెడ రూరల్: గుండెపుడి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఘనంగా ఊరేగించారు. ఆగస్టు 16వ తారీఖున శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని భక్తులు శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చారు. 5 రోజుల పాటు నిత్య పూజలు చేసి అనంతరం గ్రామవీధుల్లో ఊరేగించారు. ఉమేష్, అంజి, ఈశ్వర్, సులోచన, సుజాత, ఉష, రోహిత్, స్వాతి, ఉత్వేజ్, శివవరప్రసాద్, భారతి, శైలజ, మమత, నాగమణి, అనిత, ఉపేంద్ర, స్వాతి పాల్గొన్నారు.

సన్మానం

నెల్లికుదురు: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ నాయక్‌కు బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చందు రాజు, నాయకులు రాస యాకిరెడ్డి, సురేష్, పాపారావు, మురళి, ఐలయ్య, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బాబురావు సెల్ ఫోన్ పోగొట్టుకోగా ఆచూకీ కనుగొని అతడికి అప్పగించామని రూరల్ ఎస్సై దీపిక, రెండో ఎస్సై రవికిరణ్ బుధవారం తెలిపారు. బాబురావు గత సంవత్సరం డిసెంబర్ 25వ తేదీన కొమ్ముగూడెం నుంచి మహబూబాబాద్ పట్టణానికి వస్తుండగా తన సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడని తెలిపారు. తమకు ఫిర్యాదు చేయగా మహిళా కానిస్టేబుల్ ఉమ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ ఆచూకీ కనుగొన్నాక అతడికి అప్పగించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

డోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తేలూరి నవీన్, గోరు లక్ష్మీనారాయణ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్ తదితరులు ఆహ్వానించారు.

మహాసభలకు తరలిన సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్: మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలకు పార్టీ శ్రేణులు బుధవారం తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి, సహాయ కార్యదర్శులు అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్, నాయకులు ఉన్నారు.

ఎన్నిక

కురవి: తెలంగాణ బీసీ ప్రజాసంఘం కురవి మండల అధ్యక్షుడిగా గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన మాచర్ల హరీశ్ బుధవారం ఎన్నికైనట్లు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ తెలిపారు. ఈ మేరకు హరీశ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. బీసీల ఐక్యత కోసం పనిచేస్తానని తెలిపారు.

రోడ్ల మరమ్మతుకు ఆటోడ్రైవర్ దీక్ష

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి కేసముద్రంవిలేజ్ దర్గా వరకు గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతు చేయాలంటూ మున్సిపాలిటీలో ప్రధాన రహదారి పక్కన చైతన్యనగర్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ వల్లందాసు సతీష్ బుధవారం దీక్షలో కూర్చున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారిపై అడుగడుగునా గుంతలు పడటంతో ఆటోలో గర్భిణులు, ఆపరేషన్ చేసుకున్న వారు, ప్రయాణికులను తీసుకెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్ల మరమ్మతు చేపట్టాలని, లేకుంటే ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతామన్నారు.

మార్వాడీలవి మోసపూరిత వ్యాపారాలు

తొర్రూరు: మార్వాడీలవి మోసపూరిత వ్యాపారాలని ఎస్సీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పంతం విజేందర్, టీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు వెలిశాల శ్యామ్ అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ వాసులపై మార్వాడీ వ్యాపారుల దాడిని ఖండిస్తూ ఎస్సీ విద్యార్థి సమాఖ్య, టీఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ నెల 22న తెలంగాణ వ్యాప్తంగా చేపట్టే బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు ప్రవీణ్, శేఖర్, శ్వేత, నవతేజ, శ్రావణ్‌లు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారు

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని చిలుకోడు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ పల్లెప్రగతి యాత్రలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో పేదలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డీఎస్ జగదీష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్, నాయకులు లాలూనాయక్, వెంకటేశ్వర్లు, ఆంగోత్ వెంకటన్న, రాజునాయక్, రాయల వెంకటేశ్వర్లు బండి ఉదయ్, నగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

కేసముద్రం: మండలంలోని కల్వల జెడ్పీహైస్కూల్‌లో విద్యుత్ ప్రమాదాల నివారణ, రక్షణ చర్యలపై విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ విద్యుత్ శాఖ డీఈ విజయ్, సేఫ్టీ ఆఫీసర్ డివిజనల్ ఇంజనీర్ హీరాలాల్ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగానే జరుగుతాయన్నారు. ఇంట్లో వాడే విద్యుత్ పరికరాలను నాణ్యమైనవి ఉపయోగిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. దుస్తులు ఆరేసేందుకు ఇనుప తీగను వాడొద్దని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బండారు నరేందర్, పీఎస్ హెచ్ఎం క్లైం వీరారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈ విజయ్